ఉక్కు పరిశ్రమపై కేంద్రం కుంటి సాకులు

- సాధ్యం కాదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానమివ్వడం హాస్యాస్పదం
- ఉక్కు సాధన కమిటీ కన్వీనర్ గౌని ఐలయ్య

బయ్యారం, డిసెంబర్ 13 : కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులతో బయ్యారం ఉక్కు పరిశ్రమను నిరాకరిస్తోందని ఉక్కు సాధన కమిటీ కన్వీనర్ గౌని ఐలయ్య అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపన సాధ్యం కాదని రాతపూర్వక సమాధానం ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన నాడు ముడి ఖనిజ నిల్వల ప్రస్తావనే

గౌని ఐలయ్య

రాలేదని, ఉక్కు పరిశ్రమకు ఖనిజ నిల్వలకు సంబంధం లేదన్నారు. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ముడి ఖనిజాన్ని కేటాయించలేదని పేర్కొన్నారు. 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ముడి ఇనుప ఖనిజాన్ని, 400 కిలో మీటర్ల దూరంలో ఉన్న బయ్యారం సమీపంలోని మాదారం నుంచి డోలమైట్, భద్రాద్రి జిల్లా నుంచి బొగ్గు తీసుకెళ్తూ విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ రూ.లక్షల కోట్ల లాభాలను గడిస్తోందన్నారు. బయ్యారానికి చత్తీస్‌గఢ్ ఇనుప గనులు 200 కిలోమీటర్ల లోపే ఉంటాయని, 15కిలో మీటర్ల దూరంలో మాదారం డోలమైట్, 25కిలోమీటర్ల దూరంలో ఇల్లందు బొగ్గు గనులు ఉన్నాయని, అన్ని వనరులు ఉన్నా బయ్యారం ఉక్కు పరిశ్రమ నిర్మించకుండా కుంటిసాకులతో కేంద్రంలోని బీజేపీ ఎగ్గొట్టాలని చూస్తోందన్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంతకుముందు కూడా బయ్యారంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని ప్రకటించారని, విభజన చట్టంలో పేర్కొన్న ఉక్కు పరిశ్రమ సాధించటానికి కృషి చేయాల్సిన మంత్రి సాధ్యం కాదని ప్రకటించటం బాధ్యతా రాహిత్యమని విమర్శించారు. ఉక్కు పరిశ్రమ నిర్మించకుంటే బీజేపీ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ఇద్దరికి మూడేళ్ల జైలు

దంతాలపల్లి, డిసెంబర్ 13: మండలంలోని బీరిశెట్టిగూడెంలో చోరీకి పాల్పడిన ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కృష్ణమూర్తి ఇంట్లో చోరీకి పాల్పడిన సత్తుపల్లికి చెందిన అనిల్‌కుమార్, మందమర్రికి చెందిన రాజ్‌కుమార్‌కు తొర్రూర్ మేజిస్ట్రేట్ సరిత మూడేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

కాపర్‌వైర్ చోరీ

తొర్రూరు, డిసెంబర్ 13: ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌వైర్ చోరీకి గురైన ఘటన మండలంలో జరిగింది. మండలంలోని గుడిబండ తండా జీపీ పరిధి జామ్లాతండాలో రైతు బానోత్ నానుకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్, ఇతర సామగ్రిని గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దాని విలువ సుమారు రూ.70వేలు ఉంటుంది.

వ్యక్తి అదృశ్యం

పాపయ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13: పట్టణంలో ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వేంకటేశ్వర బజార్‌లో నివసిస్తున్న దాసరి పాపయ్య నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువుల వద్ద, అన్ని ఏరియాల్లో వెతికినా ఆచూకీ దొరక లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరికైనా తెలిస్తే 9032268632 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందిస్తున్న పోలీసులు

పోలీసులు ఔదార్యం

కురవి, డిసెంబర్ 13. బలపాల గ్రామానికి చెందిన చిన్నారులు తల్లిదండ్రులు చనిపోయి అమ్మమ్మ వద్ద ఉంటున్న సుమలత, నాగమణికి ఎస్సై సతీశ్ రూ.10వేలు, పోలీసు సిబ్బంది రూ.10వేలు మొత్తం రూ. 20వేలు ఆర్థికసాయం అందజేశారు. బ్యాంకులో ఫిక్స్‌డ్ చేసి బ్యాండు పేపర్ అందజేశారు. పండ్లు, ఆర్థికసాయం అందించారు. ఏఎస్సైలు సత్తయ్య, వెంకన్న, కానిస్టేబుల్ కాశీరాం, యాకేశ్, శ్రావణి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల నిరసన

నర్సింహులపేట, డిసెంబర్ 13: తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్ టీచర్లు భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ 010 పద్దు ద్వారా జీతాలు అందించాలని, నోషనల్ సర్వీస్ సాధన, పీజీటీలను జేఎల్‌గా ప్రమోషన్లు ఇవ్వాలని, హెల్త్ కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All

PLOT FOR SALE
★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

సైబర్‌మోసం.. రూ.75వేలు స్వాహా

నర్సింహులపేట, డిసెంబర్ 13: క్రెడిట్‌కార్డు ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని, లేకపోతే రూ.4వేలు ఫైన్ పడుతుందనడంతో నమ్మి క్రెడిట్ కార్డు నంబర్, ఓటీపీ చెప్పడంతో రూ.75వేలు కట్ అయ్యాయి. మండలంలోని కొమ్ములవంచకు చెందిన చీకటి రమేశ్‌ను సైబర్‌నేరగాళ్లు మోసం చేశారు. దీంతో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం ఎస్సై బీ సురేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : ఉరేసుకుని ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గుండ్లకుంట కాలనీకి చెందిన జాకోజు ధనమ్మ(70) భర్త చనిపోవటంతో ఇంట్లోనే ఉంటోంది. చెల్లె సరోజ ఆమె బాగోగులు చూసుకుంటోంది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో శుక్రవారం ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి చెల్లె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న కోతుల పట్టివేత

కోతులను పట్టిస్తున్న కొమ్మాలు

గూడూరు, డిసెంబర్ 13: మండల కేంద్రంలో కోతుల పట్టివేత కొనసాగుతున్నది. గూడూరు, గొల్లగూడెం, చంద్రుగూడెం, ఎస్సీకాలనీలో నెల రోజులుగా కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులను కరవడం, ఇళ్లలో చొరబడుతున్నాయి. దీంతో కోతులను పట్టించేందుకు వాంకుడోత్ కొమ్మాలు ముందుకు వచ్చారు. కోతులు పట్టే వారిని రప్పించగా వారు 20రోజులుగా సుమారు 1600 కోతులను పట్టి అటవీప్రాంతంలో వదిలేశారు. దీంతో ప్రజలకు ఊరట లభించింది. మిగతా వాటిని పట్టిస్తామని కొమ్మాలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి గణిత పోటీలకు విఘ్నేష్ ఎంపిక

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13: హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి గణిత పోటీలకు కంబాలపల్లి జడ్పీ స్కూల్ విద్యార్థి వంపటి విఘ్నేష్ ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొర్రూరు మండలం మాటేడులో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- మాజీ మంత్రి దయాకర్‌రావు
- బాధిత కుటుంబాలకు పరామర్శ

పెద్దవంగర/తొర్రూరు, డిసెంబర్ 13: అధైర్యపడొద్దని.. ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో పలు కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ.. అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ తూర్పాటి సంగీతా రవి తల్లి గీత అనారోగ్యంతో మృతిచెందగా, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ధరావత్ దేవేందర్, భూక్య

తొర్రూరులో మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

సీతారాం అనారోగ్యంతో మృతిచెందగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చిన్నవంగరకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పడాల సోమయ్య కుమారుడు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిన్న అంజయ్య, మాజీ దేవస్థాన చైర్మన్ రామచంద్రశర్మ, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సీతారాములు, ఐలయ్య, కౌన్సిలర్ శ్రీనివాస్, శంకర్, నాయకులు కుర్ర శ్రీనివాస్, వెంకన్న, నాగరాజు, సంజయ్, సుదీర్‌కుమార్, రాము, విజయపాల్‌రెడ్డి, జైసింగ్, ఆశయ్య, కాలునాయక్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువకు మరమ్మతులు చేపట్టాలి

ఎస్సారెస్పీ కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నెల్లికుదురు, డిసెంబర్ 13: మర్రికుంట తండా వద్ద తెగిన ఎస్సారెస్పీ కాలువకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునుగంటి రాజన్న అధికారులను డిమాండ్ చేశారు. తెగిన ఎస్సారెస్పీ కాలువను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బొల్లికుంట నుంచి వచ్చే ఎస్సారెస్పీ డీబీఎం-48 10ఆర్1కాలువ ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో 23కిలోమీటర్ల మేర వందలాది వ్యవసాయ భూములకు సాగునీరు అందిస్తుంది. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎస్సారెస్పీ కాలువ 200 మీటర్ల మేర ధ్వంసమైంది. సంబంధిత కాలువను ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి ఎస్సారెస్పీ జలాలు అందించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు, మండల నాయకులు పెరుమాండ్ల బాబుగౌడ్, రైతులు ధరావత్ పాన్య, వాంగోత్ రవి, బిచా శ్రీను, సైదులు, బాణాల యాకన్న, తోట నర్సయ్య పాల్గొన్నారు.

రైతుకు బేడీలు వేసి హాస్పిటల్‌కు తీసుకెళ్లడం దుర్మార్గం

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : లగచర్ల ఘటనలో రిమాండ్‌లో ఉన్న రైతు హీర్యానాయక్‌ను పోలీసులు బేడీలు వేసి వైద్యం కోసం హాస్పిటల్‌కు తీసుకెళ్లడం దుర్మార్గమని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి మామిడాల భిక్షపతి, గౌని ఐలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లగచర్ల సహా ఐదు గ్రామాలకు చెందిన 1300 ఎకరాలను ఫార్మా కంపెనీల కోసం సేకరించేందుకు ప్రయత్నించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఉద్యమానికి తలొగ్గి నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించిందని తెలిపారు. రైతులపై కేసులు ఉపసంహరించుకోకుండా వంద మందికి పైగా రైతులను జైలులో పెట్టిందన్నారు. ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో ప్రజాస్వామ్య హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తుందని పేర్కొన్నారు. వేల ఎకరాలను ప్రజల నుంచి గుంజుకోవాలనే లక్ష్యంతోనే ప్రజల అభిప్రాయాలను లెక్క చేయకుండా ప్రభుత్వం వ్యవహరించటం సరికాదని, పౌర హక్కులను ఉల్లంఘించడం వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యతోనే ఎదుగుదల సాధ్యం

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : విద్యతోనే ఎదుగుదల సాధ్యమని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే అనేక అంశాలపై ప్రేరణ సదస్సులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ నాగవాణి, సభ్యులు డేవిడ్, రమేశ్ పాల్గొన్నారు.

కాస్మోటిక్స్ చార్జీల పెంపు కార్యక్రమానికి ఏర్పాట్లు

జిల్లాలో అన్ని వసతిగృహాల్లో శనివారం జరిగే డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రత్యేక అధికారులు, సంబంధిత సిబ్బంది కార్యక్రమాలకు సర్వం సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలు పంపామని, అధికారులు హాస్టల్స్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు.

సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేను క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వే కోసం 113 మంది సూపర్‌వైజర్లు, 547 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని, జిల్లా గ్రామీణ ప్రాంతం, పట్టణాల్లో సజావుగా నిర్వహించాలని అన్నారు. గ్రామ పంచాయతీలు, వార్డుల్లో పంచాయతీ సెక్రటరీలు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో సర్వే వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని రూరల్ సీఐ సరవయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని జమాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌క్రైమ్, మహిళల భద్రత, క్రీడల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించాలన్నారు. చదువుతోపాటు క్రీడలపై శ్రద్ధ వహించాలని విద్య, ఉద్యోగ రంగాల్లో క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. రూరల్ ఎస్సై దీపిక, కానిస్టేబుళ్లు సంపత్, రామదాసు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : జిల్లా కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులో వేలాదిగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ సాధారణ పద్ధతిలో పరిష్కరించటం సాధ్యం కాదని, అందుకే లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి సురేశ్, న్యాయ వాదులు పాల్గొన్నారు.

నైనాలలో మెగా పశువైద్యశిబిరం

వైద్యం చేస్తున్న డాక్టర్ సోమ శ్రీనివాస్

నెల్లికుదురు, డిసెంబర్ 13: జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నైనాల గ్రామంలో మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స, దూడల ప్రదర్శన, పాల ఉత్పత్తి పోటీలను నిర్వహించారు. మండల పశువైద్యాధికారి సోమశ్రీనివాస్, ఐఎస్‌ఏ పులి ఉపేందర్, ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ కె.రఘువీర్, గోపాలమిత్రలు కె.సత్యనారాయణ, శంకర్, కుమారస్వామి, కృష్ణ, పీ.యాకాంబ్రం పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

జీపీ కార్మికులతో మాట్లాడుతున్న రవి

పెద్దవంగర, డిసెంబర్ 13: రాష్ట్ర వ్యాప్తంగా జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 17న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ అనుబంధం 106) రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం చిన్నవంగరలో జీపీ కార్మికులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఇవ్వటం లేదని, పెరిగిన జనాభా ప్రకారం అదనపు సిబ్బందిని నియమించి, పని భారాన్ని తగ్గించాలన్నారు. యూనియన్ నాయకులు బీకు, సోమనర్సయ్య, మధుకర్, లక్ష్మణ్, పద్మ, సోమయ్య పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కురవి, డిసెంబర్ 13: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు దాత బుక్క వీరన్న శుక్రవారం డీఈవో రవీందర్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. డీఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. హెచ్‌ఎం వహీద్, ఉపాధ్యాయులు నాగయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సైదులు, జిల్లా విద్యా శాఖ సైన్స్ అధికారి అప్పారావు పాల్గొన్నారు.

కాకతీయ టొయోటా షోరూమ్ ప్రారంభం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పట్టణ ప్రముఖులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : కాకతీయ టొయోటా యాజమాన్యం అన్ని రకాల కార్లపై రూ.లక్ష వరకు డిస్కౌంట్ సౌకర్యం కల్పించిందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం పట్టణంలో కాకతీయ టయోటా వరంగల్ షోరూమ్ వారు మహా గ్రామీణ మహోత్సవంలో భాగంగా కాకతీయ టొయోటా షో రూమ్‌ను పట్టణ ప్రముఖులు, టొయోటా కంపెనీ ప్రతినిధులు జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. పట్టణంలోని ప్రజల సౌకర్యార్థం అన్ని రకాల మోడల్ కార్లు అందుబాటులో ఉన్నాయని, అన్నింటికీ ఫైనాన్స్ సౌకర్యం, ఎక్స్ఛేంజ్ కల్పించినట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి ఘననివాళి

పాడె మోస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కౌన్సిలర్ చల్లాల ఉమ భర్త యాకయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. యాకయ్య అంతియయాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులతోపాటు పాల్గొని పాడె మోశారు. బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

32 దరఖాస్తుల స్వీకరణ

దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ వేణుగోపాలచారి

దంతాలపల్లి, డిసెంబర్ 13: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో అధికారులు 32 దరఖాస్తులు స్వీకరించారు. సబ్ డివిజన్ పరిధిలోని దంతాలపల్లి, నెల్లికుదురు మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యలపై టీజీ ఎన్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ వేణుగోపాలచారి ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వినియోగదారులకు హామీ ఇచ్చారు. రమేశ్, చరణ్‌దాసు, రామారావు, ఏఈ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వొద్దు

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ బాబురావు, ఎస్సై

గంగారం, డిసెంబర్ 13: ఏజెన్సీ గ్రామాల ప్రజలు మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వొద్దని సీఐ బాబురావు అన్నారు. శుక్రవారం మండలంలోని తిర్మలగండి గ్రామ పంచాయతీలో వెంకమ్మగుంపు గ్రామస్తులతో సీఐ మాట్లాడారు. మావోయిస్టులను గ్రామాల్లోకి అనుమతించొద్దన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామంలో 30 నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గంగారం ఎస్సై రవికుమార్, కొత్తగూడ ఎస్సై కుషకుమార్ పాల్గొన్నారు.

టీచర్ కుటుంబానికి ఆర్థికసాయం

నర్సింహులపేట, డిసెంబర్ 13: డీఎస్సీ 2024లో ఉద్యోగం పొంది ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి పీఆర్టీయూ సంఘం నుంచి శుక్రవారం ఆర్థికసాయం అందించారు. బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన ఉపేందర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆతడి కుటుంబానికి రూ.18,500 అందజేశారు. పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణచందర్, సంజీవ, మహిపాల్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందాలి

డోర్నకల్, డిసెంబర్ 13: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ పథకాలను అర్హులు లబ్ధిపొందాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిల్కోడులో ఎస్సీలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందాలంటే ఆధార్, రేషన్, పాన్ కార్డులు, బ్యాంకు అకౌంట్, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. బ్యాంకులో సిబిల్ స్కోర్ కలిగి ఉండాలని చెప్పారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీలకు ప్రభుత్వ పథకాలు రానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వీరభద్రరావు, ఏపీఎం శంకర్‌నాయక్, ఏపీవో పార్థసారథి, పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

పెద్దవంగర/ తొర్రూరు, డిసెంబర్ 13: విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని పెద్దవంగర, తొర్రూరు మండలాల ప్రత్యేక అధికారులు వెంకటేశ్వర్లు, విజయ్‌చంద్ర అన్నారు. శుక్రవారం ఆయా మండలాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీ, గురుకుల బాలికల వసతిగృహాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారు మాట్లాడుతూ వసతిగృహాల్లో విద్యార్థులకు వంటలు చేసే సిబ్బంది వంటగదులతో పరిశుభ్రత పాటిస్తూ, పౌష్టిక ఆహారాన్ని అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏఈవో భరత్ చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లు వాడొద్దు

దంతాలపల్లి, డిసెంబర్ 13: విద్యార్థులు సెల్‌ఫోన్లను ఎక్కువగా వాడి, చెడుఅలవాట్లకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని దాట్ల జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కృష్ణయ్య అన్నారు. శుక్రవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చిన్న వయసులోనే ఆకర్షణలకు గురై డ్రగ్స్‌కు బానిస కాకుండా, బాగా చదివి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని తెలిపారు. మహేశ్వరి, సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో సమస్యలు పరిష్కరించాలి

డోర్నకల్, డిసెంబర్ 13: పశువైద్యశాలలో సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం పశు వైద్యాధికారి పీ నాగేశ్వరరావు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్నకు వినతిపత్రం అందజేశారు. డోర్నకల్ పశువైద్యశాలలో పశువులకు నీటి తొట్టీలు ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి మరమ్మతులు, గోడలకు రంగువేయించాలని అందులో కోరారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : రైతులు కూరగాయల పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే ఎక్కువ ఆదాయం వస్తుందని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానాన్ని సందర్శించారు. ఆయన రైతులకు మల్యాలలో పండిస్తున్న సపోటా, కాలిపత్తికి రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. ఈ పరిశోధన స్థానంలో వివిధ రకాల మామిడి జామ, నిమ్మ వంటి జన్యు సంపదలను పరిశీలించారు. ఆర్క తేజస్వీ మిర్చిరకం తోటలను ముడత రోగం, నల్ల తామర వంటి వాటి తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ, కత్తుల నాగరాజు, రైతులు కృష్ణారెడ్డి, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు కావడంలేదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలాష్ఠి రమేశ్ అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై శుక్రవారం కలెక్టరేట్‌లో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఒకేసారి విడుదల చేయాలని, ఉద్యోగ విరమణ తర్వాత చెల్లింపులను వెంటనే అందజేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని, పీఆర్సీ అమలు చేస్తామన్న ప్రభుత్వం హామీ నెరవేర్చాలన్నారు. విద్యారంగానికి 15శాతం నిధులు మంజూరు చేయాలన్నారు. విష్ణువర్ధన్, శ్రీశైలం, శ్రీనివాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మురళీధర్ అన్నారు. పట్టణంలో శుక్రవారం వివిధ పీహెచ్‌సీల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తహీనత ఉన్న గర్భిణీలను గుర్తించి ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్‌ను అందించాలన్నారు. అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందించాలని ఆదేశించారు. డాక్టర్లు ప్రమీల, సుధీర్‌రెడ్డి, సారంగం, విజయ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

మాజీ ఎమ్మెల్యే రెడ్యా పరామర్శ

నర్సింహులపేట, డిసెంబర్ 13: నర్సింహులపేట మాజీ ఎంపీటీసీ మిర్యాల వెంకన్న రెండో కుమారుడు విష్ణు మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మైదం దేవేందర్, మాజీ వైస్ ఎంపీపీ జాటోత్ దేవేందర్, నాయకులు జగదీశ్వర్, కర్ల నాగన్న, బండి రమేశ్, నరసింహారెడ్డి, రామన్న, శ్రీశైలం, గౌస్, సురేశ్, వెంకన్న, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

జేఎల్‌ల సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం, డిసెంబర్ 13: జూనియర్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఎంటీఏ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఆ సంఘం నాయకులు దుర్గాప్రసాద్ మాట్లాడారు. లెక్చరర్ల ప్రమోషన్లు, కారుణ్య నియామకాలు, నోషనల్ ఇంక్రిమెంట్లు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. చంద్రమోహన్, చంద్రశేఖర్, నాగరాజు, వీరబాబు, పూర్ణప్రసాద పార్థసారథి, శ్వేత, శ్రీదేవి, జయరేఖ, విజయకుమారి, నరసయ్య, సోమయ్య, రమేశ్ ఉన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 13 : నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ముందు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ వార్డెన్ స్థానికంగా ఉండకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, నిర్లక్ష్యంగా ఉంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మహేశ్, వినోద్, యాకన్న, నరేశ్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని ప్రాథమికంగానే గుర్తించాలి

పెద్దవంగర, డిసెంబర్ 13: కుష్టు వ్యాధిని ప్రాథమికంగానే గుర్తించాలని డాక్టర్ మానస అన్నారు. శుక్రవారం వడ్డెకొత్తపల్లిలో కుష్టువ్యాధి ఇంటింటా సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 2027నాటికి కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ ఏడాది నేషనల్ స్ట్రాటజిక్ ప్లాన్ రోడ్డు మ్యాప్ ఫర్ లెప్రసీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించిదని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది వనాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్, అనంతలక్ష్మీ, బూబా, రజిత, హేమలత, పుష్ప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

గార్ల, డిసెంబర్ 13: ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని న్యూడెమోక్రసీ నాయకుడు జీ సక్రు శుక్రవారం డీటీ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బూటకపు మాటలకు ప్రజలు మోసపోయారని, ఆరు గ్యారెంటీలు 420 హామీలు అమలు చేసే వరకూ పోరాటం చేస్తామన్నారు. నాయకులు గణేశ్, మాన్య నాయక్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

చిన్నగూడూరు (మరిపెడ), డిసెంబర్ 13: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని హెచ్‌ఎం అనంతరావు అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని మరిపెడ ఉన్నత పాఠశాలలో నూతనంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ప్రారంభించిన హెచ్‌ఎం మాట్లాడారు. మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని అన్నారు. పాఠ్యాంశాలతోపాటు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాల అభ్యాసన చేసి లోకజ్ఞానం పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ ఇన్‌చార్జి సుధ, ఉపాధ్యాయులు జనార్ధనాచారి, మంజుశ్రీ, శ్రీశైలం, నెహ్రూ, స్వప్న, సారయ్య, ప్రకాశ్ ఉన్నారు.